# గూబ గోపాయిగాడు

నేనూ గూబగోపాయిగాడూ ఓ రోజు ఆఫీసర్ల మెస్సు ప్రక్కన కూకున్నాం చెట్టుకింద. మెస్సులో ఆఫీసర్లు తాగుతున్నారు. మేంగూడ ఓ బాటిలు, రెండు గలాసులూ తెచ్చుకుని ఏసుకుంటున్నాం.

"పేర్లు పెట్టుకోడంలో మా తమాసాలున్నైరా" అన్నాను. "మరి నీకు గూబ అని బొడ్డుకోసి పెట్టిందేనా లేక దోస్తులు ముద్దుగా పిలిచే పేరా? గూబ అంటే గుడ్లగూబకు సంబందించింది గాదంట్రా?"

గ్లాసున్నర కాస్త ఎక్కువపోశా ఆడికి. చెట్టు కానుకుని బీడి ముట్టించా.

"నా ముద్దు పేరుకు చాలా గ్రంధం వుంది. నిజానికి నేను సిపాయి నుంచి లాన్స్‌నాయకి అయిన కొత్తల్లో, పమోసన్ రాంగానే గయా క్యాంపుకు పోస్టుచేశారు. ఆ రేతిరే ఎన్. సి. ఓ. ల మెస్సులో అడుగెట్టేను. మనోళ్ళంతా పదిమంది విడిముడాగా ఉంటే ఆళ్ళతో శేరే. శేరేనే గానీ తట్టెడు చిగ్గు. ఆ రోజేందో స్పెసల్ రమ్ము వచ్చిందంటా. అదిగూడా వొడ్డిత్తున్నారు. మనోళ్ళిద్దరూ అవుల్‌దారు మేజర్లు గౌహాటీపోతూ ఆళ్ళ తాలూకు శిపాయిల్‌తో క్యాంపులో ఉన్నారు. ఆళ్ళిద్దరూ బోంచేత్తూ ఏదో వాదం ఏసుకున్నారు. ఓ ఆయనపేరు రామన్న మేజరు. ఓ ఆయనపేరు యంకన్న మేజరు. ఇద్దరూ వలవలా ఏం వాదిత్తారా! రామన్న నోరు మరీ వలవలా! ప్యాక్‌డ్రిల్ డబుల్‌మార్చ్ అనేరకం. ఎంకన్న అట్టాగాదు. కాత్త నిదానం, వాదం గొప్ప."

"పేరెట్టా వచ్చిందిరా నీకు అంటే ఏందిరా యీ సోదంతానూ? నీ పేరు పెరగా"

"నే మొదట్నే సెప్పా! గ్రంవం చాలా ఉందని. కదింటావా ఇను. లేదంటావా మానేత్తా!" అన్నాడు గోసాయిగాడు.

"ఒర్ ర్ ర్ రే! ఇదే గ్రందం అయితే ఇప్పరా! అయితే ఆ ఆడర్లీ గాడ్ని అంపి ఉంకోబాటిల్ తెప్పించరా!" అన్నాను నేను.

"జరుగుతున్న వాదం జరుగుతూనే ఉంది. ఏసుకునే రమ్ము ఏసు కుంటూనే ఉన్నారు. అంతా ఏందో మాట్టాడుతూనే ఉన్నారు మద్దె మద్దె. నేమాత్రం ఒక్కమాటలేదు. చిగ్గు!"

"అవు నవును" అంటూ నేనో గలాసు ఏసుకున్నా. ఆడు రెండు గలాసులూ నింపాడు, రెండు గుక్కల్లో పీల్చేశాడు. మూతి తుడుచు కున్నాడు. ముక్కు లెగరేత్తూ అన్నాడు.

రామన్న మేజరు, ఎంకన్న మేజరుతో ఓ సవాలేశాడు. ఏం పెప్పా డంటే "నువ్ మాలావు తెలివిగలో దనుకుంటావుగందా, సరే ఇదెట్టా వచ్చిందో సెప్పు. చాలా యాండ్లకింద మా చెల్లెలు కడుపుతో ఉంది. ఓ రోజు గుడ్లగూబను సూసి బయపడ్డది. కన్నప్పుడు, బిడ్డ ఆడుగున సరీంగా గుడ్లగూబల్లేనే పుట్టుమచ్చగూడా పుట్టింది. దీన్నేమంటావు సెప్పు" అన్నాడు రామన్న మేజరు ఎంకన్నగార్ని గంభీరంగా చూత్తూ!

"దానికేమోయ్? మామూలుమాటే, ఏం? అట్టా కావొచ్చు, ఊహా పోహలున్న మనుస్సులకు దేన్నిసూసి ఘట్టిగా పదిసార్ల నుకుంటారో అదే మనస్సులో బొమ్మైపోతంది. అదే కడుపుతో ఉన్నప్పుడు అయితే బిడ్డ మీద పుట్టుమచ్చగాగూడా వత్తుంది. పెద్దోళ్ళేమంటారు? గ్రాణంరోజున కదలొద్దంటారు. అట్టాగే ఇదిగూడా" అన్నాడు యంకన్న మేజరు.

"నే సెప్పింది ఏదో దూరపుపోలికవున్న మచ్చనుకున్నావు. కాదు.

సరీగ్గా గుడ్ల గూబళ్లేనే ఉంది ఆ మచ్చ. అదే రెక్కలు, అదే మెడ, అదే కళ్ళు" అన్నాడు రామన్న మేజరు.

ఆ మాటకంతా నోరుతెరిచారు. అచ్చర్యంగా చూచారు. చడీచప్పుడూ లేదు. కొంచెం ఊగుతున్న ఒళ్లల్లోనే లేశా. ఏందో సెప్పపోయినా, కూకున్నా, నన్నెవరు సూడ్లా.

రామన్న మేజరే మళ్ళీ అన్నాడు. "నమ్మండి. నమ్మకపోండి. పిల్లి అడుగు నా కళ్ళతోనే సూశా .... సూశానంటే పిల్ల సిన్నతనంలో. దాని కిప్పుడు పందొమ్మిదేండ్లుంటై!"

ఇంకనే ఊర్కోలే! లేశాను. ఆయని కెదురుగ్గా నుంసున్నా. "అవుల్ దార్ మేజరుసాబ్! మీరు సెప్పిందంతా నిజంకావొచ్చు. నమ్మమంటే నమ్ముతా! అయితే నేను కళ్ళారసూడాలి!"

నేను మాటాడక మాటాడక దైర్నంతో మాట్లాడింది అదే. అది వరకు కాత్త నోరుతెరిసినోళ్ళంతా ఇంకా బాగా తెరిశారు. యంటనే గంద్ర గోళంగా నవ్వారు. "ఇంకా ఇంకా...." అన్నాడు గోపాయిగాడు.

ఇంకా ఇంకా ఏముంది, గ్రందం అంతా అర్దమయింది నాకు. "ఉహూ! అప్పుడొచ్చిందే నీకు గూబ గోపాయనే పేరు?" అన్నాను.

"అప్పుడొచ్చింది నాకు గూబగోపాయి అనే పేరు" అన్నాడు గోపాయి. "అయితే ఈ గ్రందం అంతా ఇక్కడెవరికీ తెలీదు, నీ కొకడికి తప్ప!"

"నీ చిగ్గుమాలినపేరు రహస్యం చెప్పడానికి నాకు చిగ్గులేదురా గోపాయి? ఏంరోవ్ నేనట్టాంటివోణ్ణి కాదురోవ్! పరవాలే! నీ రహస్యం నా దగ్గిర మహాబద్రంగా ఉంటుంది" అన్నాను నేను. ఇంతలో ఆపీచర్లు లేచారు, అన్నాడు అడ్లర్లీ అబ్బిగాడు. "అడుగూ బొడుగూ ఒక అరబాటిల్ అయినా పట్రారా" అన్నాను. అరబాటిల్‌కన్నా కొంచెం ఎక్కువే వొచ్చింది.

పుచ్చుకున్నాం, బీడీలు ముట్టించాం. 'దునియామే రంహైతో సబ్ అచ్చా హై' అనుకున్నాం. అంతలో తేలుకుట్టినాడు మాదిరిగా లటక్కున నావేపు తిరిగి అన్నాడు గోపాయిగాడు,—

"ఈ కత ఇంతటితో అయిపోలేదురా!"

"అయిపోలే మరీ!" అన్నాను నేను.

"ఓ సంవత్సరం అయింతర్వాత లీవ్‌లో ఇంటికెళ్ళాను నేను, షోక్‌గా షికారుగా పట్నం పోయాను. పీపిల్ పార్కుంటరా! ఏం డాబ్‌సరీ పార్కురా, పోయాను. ఓ బెంచిమీద కూకున్నాను యదాలాపంగా. యనక్కు తిరిగా—యారనుకున్నావ్ యనక కూకుందీ? అవుల్‌దార్ మేజర్ రామన్నా, ఓ రంభా, ఉంకో నడివయస్సామె! గడగడా వొణుకుతూ లేచాను. "మిమ్మల్ని సూడలేదు సార్ - ఛమించాల్ సార్" అని టెంషనులో నుంచున్నా. "పరవాలేదు లేవోయ్. నువ్ గూడా అవుల్దార్ వైనావ్‌గా! ఒక స్టెప్ మాత్రమేగా? ఓ సంవచ్చరంపోతే నువ్వూ అవుతావేమో అవుల్దారు మేజరు" అన్నారు రామన్నగారు.

"మీ దయసార్, మీ దయసార్" అన్నాను.

యనకటి సంగతులేమేమో మాట్టాడుకున్నాం. తర్వాత "హవుల్దార్ గోపన్నా" అన్నాడు రామన్న మేజరు.

"ఎస్ సార్" అన్నాను టెంషనులో.

"నేనూ మా చెల్లెలూ మూర్‌మార్‌కట్ పోయొస్తాం. ఈ పిల్ల మా చెల్లెలు కూతురు. జాగొర్త. తర్డుపారందాకా చదువుకున్న పిల్ల. మాట్టాడుతూ కూకో!" అంటూ పోయాడు.

"అడుగంతా గుడ్లగూబ పుట్టుమచ్చ ఈ పిల్లకేగామోసు-అయితేనేం చూట్టానికి రంబల్లె ఉంది" అనుకున్నా!

"ఇద్దరం కూకున్నాం ఎంకీ యంకడల్లె-ఊః- రాముడూ సీతల్లె - ఊః ఊః !"

"పార్వతీ పరమేశ్వరులల్లె అనరాదూ ! పీడ విరగడవుతుంది" అన్నాను నేను.

"నిజంగా సెప్పావురా! శాత్తుల్లుగాడు సెప్పినట్లు సెప్పావురా" అన్నాడు గోపాయి.

"అంటే నిజానికి—ఈః—ఈః—ఇప్పుడు కమలమ్మ నా పెళ్ళాంరా !" అన్నాడు గోపాయి. బీడీ ముట్టించాడు.

"కమలమ్మెవరురా?" అన్నాను నేను.

"అదేరా! రామన్నగారూ మేమూ ఒకటే కులంగాదంట్రా! ఆ నెల్లోనే మాయిద్దరికీ పెళ్ళైందిరా-అంటే అదే ఆ గుడ్లగూబ పుట్టుమచ్చ మనిషి" అన్నాడు గోపాయి.

"అంటే గుడ్లగూబ పుట్టుమచ్చ అబద్ధం అన్నమాట ! అవుల్దారు మేజరబద్ధం ఆడాడన్నమాట" అని నేను వాడికి కొంచెం హుషారొచ్చే ట్టన్నాను.

"అబద్ధం అంటే అబద్ధంరా ! ఎందుకంటే పిల్లడుగున పుట్టుమచ్చ గుడ్లగూబల్లె లేదురా-సీతాకోక చిలకల్లె ఉందిరా" అన్నాడు గోపాయి.

"ఓ—ఊః—ఆ !" అన్నాను నేను. ఇంకేమంటాను?

"అసలు నిజం ఏంటంటే ఆ పిల్లకు తొడ పాముందిరా ! అయితే బాంబులకు ఎదురు తిర్గిన సిపాయిలు తొడ పాముకు చత్తారంటరా ?" అన్నాడు గుడ్లగూబ గోపాయి.

"నిజంరా !" అన్నాను నేను.